సాక్షి
విశాఖపట్నం
మంగళవారం : 14 : ఫిబ్రవరి : 2023



'ప్రేమ'తో భీమిలి 8లో
ప్రేమ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా భీమిలి పేరు పొందింది. ప్రేమ కావ్యం మరో చరిత్ర ఇక్కడే షూటింగ్ జరుపుకుంది.



వైద్య విజ్ఞాన వనం 10లో
ఆంధ్రా వైద్య కళాశాల ఎన్నో విశిష్టతల సమాహారం. ఎంతో మంది వైద్యులు, స్పెషలిస్టులను అందించింది.



సరికొత్త చదువులు! 8లో
ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త చదువుల వైపు అడుగులు పడుతున్నాయి. పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా బోధన చేపట్టనున్నారు.

న్యూస్‌రీల్

నేడు టూరిస్ట్ పోలీసు స్టేషన్ ప్రారంభం

బీచ్‌రోడ్డు: ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు స్టేషన్‌ను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం 10.30 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. పోలీసు స్టేషన్‌తో పాటు 10 ద్విచక్ర వాహనాలు, రెండు మినీ బీచ్ పెట్రోలింగ్ ట్రాక్టర్స్‌ను ప్రారంభిస్తారు. వీటి వల్ల నగరానికి వచ్చే పర్యాటకులకు మరింత భద్రత చేకూరనుంది.

జీవీఎంసీ బడ్జెట్ సమావేశం వాయిదా

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఈ నెల 15న నిర్వహించనున్న జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం వాయిదా వేస్తున్నట్టు కార్యదర్శి పి.నల్లనయ్య ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశం తిరిగి నిర్వహించే తేదీ, సమయం సభ్యులకు తెలియజేస్తామన్నారు.

బుల్లయ్య కళాశాలకు స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డు

సీతంపేట: వరల్డ్ హెచ్ఆర్‌డీ కాంగ్రెస్ 2023 ప్రకటించిన స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డుకు లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎంపికైంది. ముంబయిలో తాజ్ ల్యాండ్స్ ఎండ్‌లో ఈ నెల 15న జరగనున్న ఒక కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.దీపక్ చౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ హెడ్ వి.రాధాదేవి అవార్డు అందుకోనున్నారు. విద్యా నాణ్యత ప్రమాణాలు, ఔట్రీచ్ ప్రోగ్రామ్, స్కిల్ డెవలప్‌మెంట్ వైపు లీడర్‌షిప్ ఇనిషియేటివ్, క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లెర్నర్స్ పాయింట్ ఆఫ్ వ్యూ నుంచి ప్రభావం, ఫ్యూచర్ ఓరియంటేషన్, సామాజిక ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితులకు ఎంపీ పరామర్శ



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మహారాణిపేట: స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగులు, కార్మికులను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

కొనసాగుతున్న చికిత్స

ఉక్కునగరం: బాధితులకు చికిత్స కొనసాగుతుంది. డీజీఎం దాలీవాలకు అవసరమైన సర్జరీ చేశారు. నలుగురికి ఆస్పత్రి ప్లాస్టిక్ సర్జన్ నేతృత్వంలో ఆధునిక చికిత్స కొనసాగుతోంది.

జాతీయ సమగ్రత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



వలంటీర్లను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ సమగ్రత శిబిరానికి ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 22 నుంచి పంజాబ్ రాష్ట్రంలోని పంజాబీ యూనివర్సిటీ(పాటియాలా)లో జరిగే జాతీయ సమగ్రత శిబిరానికి ఏయూకు చెందిన ఐదుగురు వలంటీర్లు, ఒక ప్రోగ్రాం అధికారి ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది వలంటీర్లు ఈ శిబిరానికి ఎంపిక కాగా, వీరిలో ఐదుగురు ఏయూ వలంటీర్లు కావడం గమనార్హం. ఈ సందర్భంగా వలంటీర్లను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద.రెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో పాల్గొంటున్న వలంటీర్లకు డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ వి.రత్నభారతి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ శిబిరానికి ఎ.జి.ఎస్.మణిచంద్ర, ఎం.డి అఫ్రీన్ మీర్జ, బి.ఏంజిలీనా, కె.రచన, వసంత వెళ్తారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

ఒకే ఒక లోకం నువ్వే.. లోకంలోన అందం నువ్వే..



కులము.. గిలము.. బలము చూసి..
వయసు.. వరస.. సొగసూ చూసి..
పుట్టుకొస్తాదా ప్రేమ..?
మనసుకు మనసుకు వంతెనేసి..
తనువూ.. తనువూ మెలికలేసే తీరేరా ప్రేమ..
కవి చెప్పినట్లుగానే... ఆకాశమంతా.. ఆనందమై..
తెల్లారుతోంది ప్రేమికుల కోసమే..
ఆలోచనంతా ఆరాటమై.. అన్వేషిస్తోంది
ఈరోజు కోసమేనంటున్నారు వైజాగ్ ప్రేమికులు

– సాక్షి, విశాఖపట్నం

- వలపు సంబరాలు చేసుకుంటున్న జంట హృదయాలు
- ప్రేమికుల రోజున నగరంలో జోరుగా వ్యాపారం
- వాలంటైన్స్‌డే గిఫ్టుల అమ్మకాల విలువ రూ.20 కోట్లు దాటే అవకాశం





నగరమంతా వాలంటైన్ ఫీవర్‌తో గులాబీలా విరుచుకుంది. జంట హృదయాలు వలపు సంబరాలు చేసుకుంటుంటే.. ఆ గుండెకు హత్తుకునేలా బహుమతులిచ్చిపుచ్చుకునే సందడితో వ్యాపారులు కూడా వాలెంటైన్ సంబరాలు చేసుకుంటున్నారు.

లవ్ వైజాగ్‌లో... లవ్ యూ డార్లింగ్..

ప్రేమకు ప్రాంతం లేదు.. కులం లేదు.. మతం లేదు.. భాష లేదు, భావం లేదు. ప్రేమ అందరి హృదయాల్ని కొల్లగొట్టేసింది. విశాఖ యువతరం కూడా ప్రేమ వానలో తడిసి ముద్దయిపోతున్నారు. ఎప్పుడెప్పుడా అని ఫిబ్రవరి 14 కోసం ఎదురుచూస్తూ తమకు నచ్చిన వారికి ముచ్చటైన బహుమతులు కొని ఇంప్రెస్ చెయ్యాలని రాత్రంతా అన్వేషిస్తూనే ఉన్నారు. పార్కులు, బీచ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు.. ఇలా అన్ని చోట్లా జంట గువ్వలు గుసగుసలాడుకుంటూనే ఉంటాయి. తొలినాళ్లలో ప్రేమంటే మాటల ద్వారా వ్యక్తపరిచేది. ఆ తర్వాత ప్రేమలేఖలు.. ఆపై రోజా పూలు.. ఆ తర్వాత గ్రీటింగ్ కార్డులు.. ఇలా.. తరం మారుతున్న కొద్దీ లవ్ రిచ్‌గా మారిపోయింది. అదేమని అడిగితే.. హలో గురూ.. ప్రేమ కోసమే కదా అని జోష్‌తో చెబుతున్నారు ఈ తరం యూత్. మరి ఈ రోజున లవ్ వైజాగ్.. లవర్స్ కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో తెలుసా..? అక్షరాలా రూ.20 కోట్ల రూపాయలు. తన కోసం ఎదురు చూసే ప్రేమ గుండెకు ఇచ్చే బహుమతిలోనే కొండంత ప్రేమ కనిపించాలని లవర్స్ ఉవ్విళ్లూరుతుంటారు. అందుకే.. విశాఖ యువత గిఫ్ట్ కోసం బోలెడు ఖర్చు చేస్తున్నారు.

- గతేడాది ప్రేమికుల రోజున నగరంలో రూ.15 కోట్ల వరకూ బహుమతులు కొన్నారని అంచనా.
- ఈ ఏడాది సుమారు రూ.20 కోట్ల వరకూ అమ్మకాలు పెరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వాలంటైన్ వీక్ పేరుతో దాదాపు రూ.10 కోట్ల అమ్మకాలు జరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.
- ప్రేమికుల రోజున మన నగరంలో రూ.2 కోట్ల రూపాయల గులాబీ పూలు అమ్ముడవుతాయని పూల వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా రెడ్, పింక్ గులాబీలే ఎక్కువగా అమ్ముడవుతాయంట.
- వ్యాపారులు గిఫ్టులకు 20 నుంచి 50 శాతం వరకూ డిస్కౌంట్ ఆఫర్లిచ్చి ఆకర్షిస్తున్నారు.
- రెస్టారెంట్స్, హోటల్స్ వాలెంటైన్స్ కోసం స్పెషల్ టేబుల్స్ రిజర్వ్ చేశాయి. బీచ్‌రోడ్డులోని కొన్ని హోటల్స్.. ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి.
- దాదాపు అన్ని జ్యువలరీ షాపులు.. వాలెంటైన్ స్పెషల్ జ్యువలరీ స్పెషల్ డిస్కౌంట్‌తో అందిస్తున్నాయి.
- ఫిబ్రవరి 14 కోసం మల్టీప్లెక్స్‌లలో అడ్వాన్స్ బుకింగ్ టికెట్లు అమ్మకాలు జరగ్గా అందులో కపుల్ టికెట్స్ దాదాపు 50 శాతం ఉండటం విశేషం.
- భీమిలి సమీపంలోని ఓ హోటల్‌లో 50 టేబుల్స్ లవ్ స్పాట్‌లుగా అడ్వాన్స్ బుకింగ్ పెట్టినట్లు ప్రకటించిన 24 గంటల్లోనే అన్నీ బుక్ అయ్యాయంట.

సోషల్ మీడియాలో లవ్ వాన

విశ్వజనీయమైన ప్రేమ.. సోషల్ మీడియానూ లవ్ వానలో ముంచెత్తేలా చేస్తోంది. వారం రోజుల క్రితం మొదలైన ప్రేమికుల వారోత్సవాలప్పుడు ప్రారంభమైన లవ్ పోస్టులు.. చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. హార్ట్‌బీట్ సింబల్స్, కవితలు, గ్రీటింగ్ కార్డులు, ప్రేమ చిహ్నాలు, గిఫ్టులు.. ఇలా ఎన్నో రకాలైన సింబల్స్, స్టిక్కర్లు, ఫొటోలు, కొటేషన్లతో ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, టెలిగ్రామ్, మెసెంజర్.. ఇలా.. అన్నీ బిజీ బిజీగా మారిపోయాయి.

పెళ్లికి కాస్త ఆలోచిస్తున్నాం

నిండా లవ్‌లో మునిగిన వారికి కూడా ఈ ప్రేమ నిర్వచనం సంగతి ఓ పట్టాన అంతుచిక్కదు. అందుకే ప్రేమకు అర్థం వెతికేందుకు నగరంలో దాదాపు 100 మంది యువతీ యువకులతో మాట్లాడగా.. చాలా మంది యువత కొత్త కొత్త అర్థాలు చెప్పారు. ఈ సమాధానాల్లోనే.. చాలా మంది వీర ప్రేమికులు, భగ్న ప్రేమికులు, టైంపాస్ బతానీలు, వన్‌సైడ్ లవర్స్ కనిపించారు. ఆ సమాధానాల సంగతేంటో మీరు చదవండి...

- ప్రేమంటే రెండు జీవితాలు, రెండు హృదయాలు, రెండు కుటుంబాలు : 35 మంది
- పెళ్లి చేసుకోడానికి వేసే మొదటి అడుగు : 15 మంది.
- కాలేజీలో ఒంటరి జీవితానికి తుంటరి తోడు : 10 మంది
- జీవితం బోర్ కొట్టకుండా టైంపాస్ చేసుకునేది : 25 మంది
- ప్రేమంటే సెక్స్ : 4
- వన్‌సైడ్ లవర్‌ని, నాకు అంతు చిక్కడంలేదు: 11 మంది

హెచ్‌సీ, పీసీలపై సస్పెన్షన్ వేటు

షాపుల్లో దందాపై సీపీ శ్రీకాంత్ సీరియస్

దొండపర్తి(విశాఖ దక్షిణ): 'ఖాకీ.. కోడి కథా చిత్రం' వ్యవహారంలో ఇద్దరిపై వేటు పడింది. దుకాణాల్లో దందా సాగించిన ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు. సీఐ పేరు చెప్పి పద్మనాభం పోలీస్‌స్టేషన్ పరిధిలో చికెన్, నిత్యావసర సరుకుల షాపుల్లో మాంసం, ఇతర సరుకులను దండుకున్న విషయం తెలిసిందే. దీనిపై 'ఖాకీ.. కోడి కథా చిత్రం' పేరుతో సాక్షి రాసిన కథనంతో పోలీస్ శాఖలో కలకలం రేగింది. సిబ్బంది వ్యవహారంపై నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ సీరియస్ అయ్యారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డీసీపీ సుమిత్ సునీల్ గరుడ్ స్వయంగా పద్మనాభం వెళ్లి విచారణ చేపట్టారు. అలాగే ఏసీపీ, ఇతర అధికారులు కూడా స్థానిక వ్యాపారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అటువంటి వారి సమాచారం చెప్పాలని స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. సిబ్బంది కాల్ డేటాను కూడా పరిశీలించారు. ఈ దందా వ్యవహారంపై పద్మనాభం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ టి.కాంతారావును గత వారంలోనే ఏఆర్‌కు పంపించారు. తాజాగా ఈ వసూళ్ల విషయంలో హెచ్‌సీతో పాటు కానిస్టేబుల్ పాత్ర కూడా ఉన్నట్లు తేలినట్లు తెలిసింది. దీంతో హెచ్‌సీ కాంతారావుతో పాటు కానిస్టేబుల్ ఎస్.బంగారునాయుడుపై సస్పెన్షన్ వేటు వేశారు.

జీడీఏ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో పైనాపిల్‌కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్(జీడీఏ) కోర్సులో శిక్షణకు ఈనెల 20లోగా దరఖాస్తులు చేసుకోవాలని మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమలకుమారి తెలిపారు. 3 నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏళ్లున్నవారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణలో చేరిన వారికి ఉచిత బస్‌పాస్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 852387 4274, 8333921337 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కాలపరిమితిలోగా అర్జీల పరిష్కారం

అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

మహారాణిపేట: స్పందన ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీ నిర్వహించాలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చిలో జరగనున్నందున అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఎన్నికల విధుల కోసం జిల్లాలోని అన్ని కార్యాలయాల ఉద్యోగుల వివరాలను వెంటనే పంపాలని ఆదేశించారు. ఈ సారి ఓటర్ల సంఖ్య రెట్టింపు అయినందున జాగ్రత్త వహించి పనిచేయాలన్నారు. నగరంలో మార్చి నెలలో ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 175 విజ్ఞప్తులు అందాయి.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, పోలీస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

మహారాణిపేట : జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంస్థలు జిల్లాలో పర్యాటక పరంగా దోహదపడే కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. ఎలక్ట్రికల్ బైక్స్ యోయో రైడ్స్, విహంగ్ అడ్వెంచర్స్ వారి పారా మోటార్ ఫ్లైయింగ్, పారా సెయిలింగ్ నీటిపైన, రోడ్డు, ఇసుక, పర్వతాలపై రైడ్ చేయగల ఆల్టేరియన్ వెహికల్స్ వివరాలను సంబంధిత సంస్థల అధినేతలు వివరించారు. ఆయా సంస్థల ప్రాజెక్టులను పరిశీలించాలని టూరిజం రీజనల్ డైరెక్టర్‌ను ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ 20 సమావేశాల సందర్భంగా దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, టూరిస్టులు అధిక సంఖ్యలో రానున్న దృష్ట్యా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్, డీసీపీ సుమిత్ సునీల్ గరుడ పలు సూచనలు చేశారు. ఆర్కియాలజీ, అటవీ శాఖ, జీవీఎంసీ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అంతా మా ఇష్టం

- కొన్ని పనులకే 3 ఎంఎం నిబంధన
- మరికొన్ని పనులకు మాత్రం సడలింపు
- రోడ్డు మార్కింగ్, స్టడ్స్ పనుల్లో వింతలు
- జీవీఎంసీ అధికారుల లీలలు

డాబాగార్డెన్స్: కొడితే కొట్టాడులే కానీ కొత్త కోక తెచ్చాడులే అన్న చందంగా మారిపోయింది గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని కొందరి అధికారుల వ్యవహారం. జీవీఎంసీ ఖజానాకు కన్నం పడినా పర్వాలేదు.. తమ జేబు నిండితే చాలు అన్న చందంగా కొందరు వ్యవహరిస్తున్నారు. ఓ వైపు నాణ్యత కోసం నిబంధనలు విధించామని చెబుతున్న అధికారులు.. తమకు కావాల్సిన వారి కోసం మాత్రం నిబంధనలు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా రోడ్డు మార్కింగ్, స్టడ్స్, సైన్ బోర్డుల ఏర్పాటు పనుల్లో కేవలం ఒకే కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రూ.కోటికిపైగా విలువైన నాలుగైదు పనులకు మాత్రం 3 ఎంఎం స్టడ్స్ కంపెనీతో ఒప్పందం కచ్చితంగా ఉండాలని నిబంధన విధించారు. కొత్తగా ఈ నిబంధన ఎందుకు పెట్టారని ఆరా తీస్తే.. కేవలం నాణ్యత కోసమే అని చెబుతున్నారు. ఇదే సందర్భంలో పిలిచిన మరో మూడు టెండర్లకు మాత్రం (టెండర్ నంబర్లు 591734, 591851, 591891) ఈ నిబంధన అమలు చేయలేదు. ఇవి తక్కువ విలువ కలిగిన పనులు కావడంతో సదరు కాంట్రాక్టర్‌కు గిట్టుబాటు కాదనే నెపంతో ఈ నిబంధన లేకుండానే టెండర్లను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఈ పనులు కూడా జీ-20, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కోసమే పిలుస్తున్న నేపథ్యంలో ఇక్కడ నాణ్యత అవసరం ఎందుకు లేకుండా పోయిందన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక సదరు కాంట్రాక్టర్‌తో ఉన్న లాలూచీయే కారణమన్న విమర్శలున్నాయి. మరోవైపు ఇతర జోన్‌ల్లో పిలిచిన పనులకు కూడా ఈ 3 ఎంఎం నిబంధన ఎందుకు విధించలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సదరు ఇన్‌చార్జి ఈఈ పరిధిలో ఎక్కువ విలువ ఉన్న పనులకు మాత్రమే ఎందుకు నిబంధన విధించారన్న దానికి సమాధానం కరువైంది. జీవీఎంసీ పనులకు ఒకే నిబంధన అమలు చేయకుండా కేవలం ఈ ఇన్‌చార్జి ఈఈ పరిధిలోనే ఎందుకు అదనపు నిబంధన చేర్చారన్న వ్యవహారంపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ఇప్పటికే కమిషనర్ ఆరా తీసినట్టు తెలుస్తోంది. మొత్తం వ్యవహారంపై నివేదిక కోరినట్టు జీవీఎంసీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పోలీస్ స్పందనకు 42 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 42 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 సుమిత్ సునీల్ గరుడ్, డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధర్, ఏసీపీ(ఎస్పీ, ఎస్టీ సెల్) బాపూజీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్పందనకు 57 వినతులు



స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న అదనపు కమిషనర్ వర్మ

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 57 వినతులు వచ్చాయి. వీటిలో జోన్-2 నుంచి ఏడు, జోన్-3 నుంచి 4 జోన్-4 నుంచి నాలుగు, జోన్-5 నుంచి 20, జోన్-6 నుంచి తొమ్మిది, జోన్-7 నుంచి ఒకటి, జోన్-8 నుంచి మూడు, ప్రధాన కార్యాలయానికి తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో పరిపాలన, అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూకి 8, ప్రజారోగ్యానికి 5, టౌన్‌ప్లానింగ్‌కు 19, ఇంజనీరింగ్/హార్టికల్చర్‌కు 5, యూసీడీకి 16 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, సెక్రటరీ పి.నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య మల్టీకేర్'పై కలెక్టర్‌కు ఫిర్యాదు

- కాలం చెల్లిన మందులు
- ఫంగస్‌తో కూడిన సెలైన్ బాటిళ్లు..
- ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ అశోక్‌బాబు తనిఖీలో వెల్లడి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్ ఎదురుగా ఉన్న ఆదిత్య మల్టీకేర్ ఆస్పత్రిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ అశోక్‌బాబు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నిబంధనలు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణ ఉందని ఆయన తనిఖీల్లో వెల్లడైంది. ఆస్పత్రిలో ఎక్కువ శాతం కాలం చెల్లిన మందులు, ఫంగస్‌తో ఉన్న సెలైన్ బాటిళ్లను ప్రత్యేక అధికారి గుర్తించారు. ఆస్పత్రికి అగ్నిమాపకశాఖ అనుమతి లేదని, అలాగే బయోవేస్టేజ్‌కు కూడా అనుమతి లేదని గుర్తించారు. ఇలాంటి ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ రోగులకు ఎలా మెరుగైన వైద్యం అందిస్తారని ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. 50 పడకల ఆస్పత్రిలో కేవలం ఇద్దరు రోగులకు మాత్రమే ఉన్నారని, ఎంబీబీఎస్ వైద్యుడు కూడా లేరని, కాలం చెల్లిన మందులున్నాయని తనిఖీల్లో బయటపడ్డాయి. కాలం చెల్లిన మందులు ఎందుకు ఉంచారని ఫార్మసిస్టును ప్రశ్నిస్తే సమాధానం దాటవేశాడు. నిబంధనలు పట్టించుకోకుండా ఆస్పత్రి నిర్వహణపై కలెక్టర్ మల్లికార్జునకు, ఆరోగ్యశ్రీ సీఈవో దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు అశోక్‌బాబు వివరించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ కె.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : మహా శివరాత్రి వేడుకలకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రముఖ శివాలయాలను ముస్తాబు చేస్తున్నట్లు దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత తెలిపారు. సోమవారం ఆమె కార్యనిర్వహణాధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని శివాలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 18న మహా శివరాత్రి, శనిత్రయోదశి కావడంతో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని కోరారు. వికలాంగులకు వీల్‌చైర్స్ సమకూరుస్తున్నట్లు చెప్పారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తామని, పిల్లలకు బిస్కెట్స్ అందజేస్తామని వివరించారు. రాత్రంతా శివాలయాలు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, చలువ పందిళ్లు వేయాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవించాల్సిందే..

- విశాఖ పోర్టు ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావు
- ఆర్కే బీచ్‌లో డ్రెడ్జింగ్ పనులు ప్రారంభం

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవించాలని.. లేకుంటే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావు అన్నారు. రూ.20 కోట్ల వ్యయంతో సోమవారం ఆర్కేబీచ్‌లో డ్రెడ్జింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ఏటా డ్రెడ్జింగ్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. సముద్రంలో పూడికను బయటకి తీయడం చాలా ఖర్చుతో పాటు సమయం పడుతుందన్నారు. విశాఖ పోర్టు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏటా రూ.20 కోట్లతో ఈ డ్రెడ్జింగ్ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. నెల రోజుల పాటు సాగే ఈ డ్రెడ్జింగ్ పనుల్లో రెండు లక్షల క్యూబిక్ టన్నుల ఇసుకను బయటకు తీయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సముద్రం అలల తాకిడికి బీచ్ కోతకు గురవుతుందని, అందమైన విశాఖను పరిరక్షించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో కూడా డ్రెడ్జింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎండీ దివాకర్, డీసీఐ సీహెచ్‌వోడీ చౌదరి, అశ్విని పాల్గొన్నారు..



డ్రెడ్జింగ్ పనులను పరిశీలిస్తున్న పోర్ట్ చైర్మన్ రామ్మోహన్ రావు

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,230
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,500
వెండి(కిలో):	రూ.72,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.100
స్కిన్	: రూ.170
స్కిన్‌లెస్	: రూ.180

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	440.00
విజయనగరం	444.00
శ్రీకాకుళం	444.00

సరికొత్త చదువులు!

- వృత్తి విద్య వైపు అడుగులు
- పాఠశాల స్థాయిలోనే అమలు
- ఉమ్మడి విశాఖలో 11 స్కూళ్ల ఎంపిక



తరగతి గదిలో విద్యార్థులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త చదువుల వైపు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా బోధన చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్ అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. 6 నుంచి 8వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వృత్తి విద్య బోధన అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 130 పాఠశాలలను ఎంపిక చేయగా, ఇందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 11 పాఠశాలలు ఉన్నాయి.

ఇదీ లక్ష్యం..

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో చాలా మంది వృత్తి విద్య కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధి గ్యారెంటీ కోర్సులు కావడంతో వీటికి మంచి క్రేజ్ ఉంది. ఇలాంటి కోర్సుల్లో చేరే విద్యార్థులను ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో పాఠశాల స్థాయిలో వృత్తి విద్య బోధన అమలుకు నిర్ణయించారు. పని అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా కార్యకలాపాలు విద్యార్థులకు అలవాటు చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పుతారు. చేతి పనులు చేయటంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించటం, విద్యార్థుల్లో పరస్పర సహకారం, బృంద పనులు అలవాటు చేస్తారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం

సైన్సు, గణితం సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలో వృత్తి విద్య అమలుపై తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తారు. పాఠశాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు, ప్రధానంగా చేతి వృత్తుల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను తీసుకెళ్తారు. చేతి వృత్తుల పరిశ్రమల నిర్వహణదారులతో ముఖాముఖి ఏర్పాటు చేస్తారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఎంపిక చేసిన పాఠశాలలు ఇవే..

విశాఖలో గోపాలపట్నం బాలురు, బాలికల జెడ్పీ హైస్కూళ్లు, నడుపూరు, చింతల అగ్రహారం ఉన్నత పాఠశాలలు, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని వడ్డాది, వేములపూడి, నక్కపల్లి జెడ్పీ హైస్కూళ్లు, తానాం బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కశింకోట జెడ్పీ హైస్కూల్ (బాలికలు), అరకువేలీ గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్, మారేడుమిల్లి గిరిజన సంక్షేమ పాఠశాలను వృత్తి విద్యా కోర్సులకు ఎంపిక చేశారు.

వృత్తి విద్యకు మంచి రోజులు



వృత్తి విద్యకు మంచి రోజులు వచ్చాయి. ఒకేషనల్ కోర్సులు చేసే విద్యార్థులకు సత్వరమే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. పాఠశాల స్థాయిలో వృత్తి విద్య బోధనకు ఏర్పాట్లు చేయడం వల్ల, విద్యార్థుల్లో మరింత ఆసక్తి పెరుగుతుంది.

– ఆర్.సత్యనారాయణ, డీవీఈవో, విశాఖ జిల్లా

బోధనకు ఏర్పాట్లు చేస్తున్నాం



పాఠశాల స్థాయిలో వృత్తి విద్య బోధన చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో దీనిని అమలు చేసేందుకు దృష్టి సారించాం. వృత్తి విద్య బోధన వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిని పటిష్టంగా అమలు చేసేలా ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేస్తాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

రోగుల సహాయకులకు సౌకర్యాలు కల్పించాలి

కేజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు చేసిన కలెక్టర్



కేజీహెచ్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ప్రతి రోజు వైద్యం కోసం కేజీహెచ్‌కు వచ్చే రోగులతోపాటు వారి సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కేజీహెచ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కేజీహెచ్‌లో పలు వార్డులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులతోపాటు వారి సహాయకులతో మాట్లాడారు. రోగులు, వారి సహాయకులు విశ్రాంతి తీసుకొనేందుకు ఏర్పాటు చేసిన 200 పడకల ఉచిత వసతి భవనాన్ని పరిశీలించారు. రోగులతోపాటు వచ్చే సహాయకులు విశ్రాంతి తీసుకొనేలా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఎమర్జెన్సీ వార్డుకు వచ్చే రోగుల సహాయకులకు విశ్రాంతి తీసుకొనేందుకు వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేజీహెచ్ పరిపాలన భవనానికి ఎదురుగా ఉన్న స్థలంలో పార్కు అభివృద్ధి చేసి అవసరమైన చోట ఫౌంటేన్‌తోపాటు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేసి నవీకరించాలన్నారు. కేజీహెచ్ ప్రవేశ ద్వారానికి ఆర్చ్ ఏర్పాటు చేయాలని, పక్కనే ఉన్న పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డైట్ టెండర్ల పరిశీలన

మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో రోగులకు, డాక్టర్లకు ప్రతిరోజు డైట్ సరఫరా చేసేందుకు టెండర్లను పిలిచారు. జేసీ కేఎస్ విశ్వనాథన్ సమక్షములో టెండర్లను బిడ్డర్ల ముందు తెరచారు. డీడీఎంసీ (డిస్ట్రిక్ట్ డైట్ మేనేజ్‌మెంటు కమిటీ) చైర్మెన్‌గా జేసీ విశ్వనాథన్, కన్వీనర్‌గా సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, చిన్న పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డైటీషియన్ సభ్యులుగా వున్న కమిటీ ఆధ్వర్యంలో ఈ నిర్వహణ జరిగింది. 11 మంది దరకాస్తు చేసుకోగా 9 మాత్రమే టెండర్లలో పాల్గొన్నారు. అన్ని అంశాలు పరిశీలించిన తరువాత బిడ్డర్లను ఎంపిక చేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.

సాయుధ పోలీసులకు క్రమశిక్షణ అవసరం



కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలి

ఆరిలోవ (విశాఖ తూర్పు): సాయుధ పోలీసులకు క్రమశిక్షణ అవసరమని అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి అన్నారు. విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో వార్షిక మొబలైజేషన్ పేరుతో రెండు వారాలుగా సాయుధ పోలీసులకు అందిస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణ గత నెల 30న ఇక్కడ ప్రారంభమైన విషయం తెలిసిందే. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఏఆర్ పోలీస్ సిబ్బందికి ఇక్కడ శిక్షణ అందించారు. ముగింపు సందర్భంగా పోలీసుల కవాతు ఆకట్టుకొంది. పోలీస్ జాగిలాల విన్యాసాలు అలరించాయి. సిబ్బంది వాటికి పరుగు పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఒకదాన్ని మించి మరొకటి పరుగు తీశాయి. అనంతరం వాటికి లాంగ్ జంప్, హై జంప్ నిర్వహించారు. ఈ పోటీల్లో జాగిలాలు చేసిన విన్యాసాలు అధికారులను సైతం అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డు సిబ్బంది పోలీస్ శాఖకు వెన్నుముఖ లాంటివారన్నారు. సాయుధ పోలీసులకు అవరమైన క్రమశిక్షణ ఇక్కడ నేర్పినట్లు తెలిపారు. ఏఆర్ పోలీసులు సివిల్ పోలీసులకు సహకరించడంలో సత్తా చూపుతున్నారన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నియంత్రిచడంలో భవిష్యత్‌లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనకాపల్లి అదనపు ఎస్పీ(క్రైం) పి.సత్యనారాయణరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు నరిసంహరావు, అప్పలనాయుడు, రామకృష్ణారావు, అరవింద్ కిశోర్, వెంకటరావు, సతీష్ పాల్గొన్నారు.

సూపర్ బజార్‌లో దిల్‌వాలా షూటింగ్



రాజేంద్రప్రసాద్, ఎంవీవీ సత్యనారాయణకు సీన్ వివరిస్తున్న దర్శకుడు వీరభద్రం చౌదరి

మహారాణిపేట : సూపర్ బజార్ ఎదురుగా ఉన్న టర్నర్ చౌల్ట్రీలో దిల్‌వాలా చిత్ర షూటింగ్ సోమవారం జరిగింది. నటకిరీటి రాజేంద్రప్రసాద్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై పలు కీలక సన్నివేశాలను దర్శకుడు వీరభద్రం చౌదరి చిత్రీకరించారు. నభిషేక్, నరసింహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. నరేష్ అగస్త్య హీరోగా శ్వేతా అవస్తీ, ప్రగ్య నయన్ హీరోయిన్లుగా డెక్కన్ డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. సంగీతం అనూప్ రూబెన్స్.

మీషో లక్కీ డ్రా పేరుతో టోకరా

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆన్‌లైన్ ఈ–కామర్స్ షాపింగ్ వెబ్‌సైట్ మీషో లక్కీ డ్రా పేరుతో నగరానికి చెందిన మహిళ నుంచి రూ.1,24,950 కాజేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు ఇదే తరహా కేసులో కడపలో అరెస్టయిన ముద్దాయిని పీటీ వారెంట్ ద్వారా అదుపుతో తీసుకొని విశాఖకు తీసుకువచ్చి విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీ షో లక్కీ డ్రాలో రూ.12.5 లక్షలు గెలుచుకున్నట్లు గత నెల 20వ తేదీన ఒక మహిళ ఇంటికి పోస్ట్ వచ్చింది. తర్వాత రోజు తెలియని నెంబర్ నుంచి కాల్ చేసి ఆమె చేసిన షాపింగ్ వివరాలు చెప్పి.. లక్కీ డ్రాలో డబ్బులు గెలుచుకున్నట్లు చెప్పడంతో అది నిజమని నమ్మింది. ఆ డబ్బులు డిపాజిట్ చేయాలంటే అకౌంట్ ఓపెన్ చేయాలని చెప్పి రూ.4,150 చెల్లించాలని చెప్పగా.. ఆమె ఫోన్ పే ద్వారా పంపించింది. అనంతరం కొత్త అకౌంట్‌లో లావాదేవీలు ఎక్కువగా ఉండాలని చెప్పడంతో మహిళ తన అకౌంట్ నుంచి రూ.1,24,950 పంపించింది. అయినప్పటికీ ఇంకా డబ్బులు వేయాలని చెప్పడంతో ఆమెకు అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం సీఐ కె.భవాని ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. అయితే ఇదే తరహాలో దాదాపుగా అన్ని జిల్లాల్లో ఫిర్యాదులు నమోదువుతున్న విషయాన్ని గుర్తించారు. ఇలాగే కడపలో జరిగిన ఘటనతో అక్కడి పోలీసులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వంకర్ మండల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలుసుకున్నారు. అలాగే అతడు విశాఖలో ఉన్న వారిని కూడా మోసం చేసినట్లు నిర్ధారణ అవడంతో అతడిని విచారించేందుకు విశాఖ పోలీసులు పీటీ వారెంట్ ద్వారా విశాఖకు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన సూత్రదారి కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'సీక్రెట్ స్ట్రాటజీ'తో ఘరానా మోసం

- రూ.1,92,172 కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- రాజస్థాన్ వెళ్లి ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): 'సీక్రెట్ స్ట్రాటజీ'లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపవుతాయని నమ్మించి ఒక వైద్యురాలి నుంచి లక్షా 92 వేల 172 రూపాయలు కాజేసిన ముగ్గురు సైబర్ నేరగాళ్లను సైబర్ క్రైం పోలీసులు రాజస్థాన్‌లో అరెస్టు చేసి సోమవారం విశాఖకు తీసుకువచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాణిపేట ప్రాంతానికి చెందిన ఒక వైద్యురాలి ఇన్‌స్టాగాంకు 'సీక్రెట్ స్ట్రాటజీ' పేరుతో ఒక నకిలీ ప్రకటన వచ్చింది. అందులో పెట్టుబడులు పెడితే స్వల్పకాలంలోనే రెట్టింపు లాభాన్ని ఆర్జించవచ్చని ఉంది. అది నిజమని నమ్మిన వైద్యురాలు ప్రకటనలో ఇచ్చిన నెంబర్‌ను సంప్రదించారు. దీంతో వారు తొలుత రూ.10 వేలు ఇన్వెస్ట్ చేయమని ఒక అకౌంట్ నెంబర్ పంపించారు. ఆమె డబ్బులు చెల్లించగా.. ఒక ఫేక్ వెబ్‌సైట్‌లో ఆ డబ్బులు రెట్టింపు అయినట్లు సైబర్ నేరగాళ్లు చూపించారు. దీంతో ఆమె మరిన్ని డబ్బులు పెట్టుబడి పెట్టారు. విడతల వారీ మొత్తం రూ.1,92,172 పంపించారు. అయితే విత్‌డ్రా చేసుకోవడానికి ఆప్షన్ లేకపోవడం, ఇంకా డబ్బులు పంపించాలని వారు డిమాండ్ చేయడంతో ఆమెకు అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం సీఐ కే.భవానీప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. ఆమె డబ్బులు వేసిన అకౌంట్లను పరిశీలించగా రాజస్థాన్‌కు చెందిన వ్యక్తుల పేర్ల మీద బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎస్‌ఐ చంద్రమౌళితో పాటు ఐదుగురు సభ్యుల బృందాన్ని రాజస్థాన్‌కు పంపించారు. బ్యాంక్ కేవైసీ ఆధారంగా రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన శంకర్ జైపాల్(23), టికోమ్ చౌదరి(42)తో పాటు మరో వ్యక్తిని సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా విశాఖకు తీసుకువచ్చారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన సూత్రదారి కోసం దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

హెచ్‌పీసీఎల్ చిమ్నీ నుంచి ఎగసిన మంటలు



చిమ్నీ నుంచి ఎగిసిపడుతున్న మంట

మల్కాపురం (విశాఖ పశ్చిమ) : హెచ్‌పీసీఎల్ చిమ్నీ నుంచి సోమవారం నల్లటి పొగ కమ్ముకుంది. ఆపై మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఈ ప్రాంతీయులు ఆందోళనకు గురయ్యారు. సంస్థలో డీహెచ్‌డీఎస్ యూనిట్‌లో మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ యూనిట్ పైపులైన్‌లో ఉండే క్రూడ్ వ్యర్థాలు చిమ్నీ ద్వారా నల్లటి పొగతో కూడిన మంట ఒక్కసారిగా ఎగసి పడింది. దీంతో జనం మరింత కలవరం చెందారు. అప్పుడప్పుడు చిమ్నీ నుంచి ఇలా పొగతో కూడిన మంట వస్తుందని ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ యాజమాన్యం పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి



రాంబాబు (ఫైల్)

అనంతగిరి : అరకు అందాలను తిలకించేందుకు వచ్చి కారు బోల్తా కొట్టిన ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అనంతగిరి పోలీసులు అందించిన వివరాలివి. విశాఖపట్నం సాగర్‌నగర్ చెందిన ఎ.రాంబాబు (51) నర్సీపట్నం టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నారు. అరకు అందాలను తిలకించేందుకు ఆదివారం మరో ఇద్దరితో కలిసి కారులో వచ్చారు. అందాలను తిలకించి, సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో మైదానప్రాంతానికి తిరిగి వెళుతుండగా, అనంతగిరి మండలం కొదంగుడ గ్రామ సమీపంలోగల మలుపువద్ద కారు అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు గాయం కావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

'ప్రేమ'తో భీమిలి

ప్రేమ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్



ఆరాధనలో పాఠశాల సన్నివేశాలు చిత్రీకరణ జరిగింది ఇందులోనే..



చామంతి చిత్రం చాలా భాగం చిత్రీకరణ జరుపుకుంది ఈ బంగ్లాలోనే..



మరోచరిత్ర షూటింగ్ జరిగిన గాలిమేడ(ఫైల్)

భీమునిపట్నం : ప్రేమ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా భీమిలి పేరు పొందింది. 1978లో విడుదలైన మరోచరిత్ర ఇక్కడ తీరంలోనే ఎక్కువ భాగం చిత్రీకరణ జరుపుకుంది. కె.బాలచందర్ దర్శకత్వంలో కమలహాసన్, సరిత హీరోహీరోయిన్లుగా నటించారు. ఇక్కడ తీరంలో అప్పటి బ్రిటిష్ గవర్నర్ ఉండడానికి 1,850 ప్రాంతంలో అరుదైన ఆకారంతో ఒక బంగ్లాను నిర్మించారు. స్వాతంత్రం వచ్చిన తరువాత దీన్ని ఎవరు వినియోగించుండా వదిలేశారు. ఇందులో పలు ముఖ్యమైన సన్నివేశాలు, పాటను చిత్రీకరించారు. ఈ చిత్రం పెద్ద హిట్ కాగా దాంతోపాటు ఈ గాలిమేడగా పిలవబడే డచ్ గవర్నర్ బంగ్లాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ సినిమా విడుదలైన తరువాత ఈ గాలిమేడను చూడడానికి నిత్యం అనేక ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చేవారు. అప్పటి నుంచి ఇక్కడ అనేక చిత్రాలు షూటింగ్‌లు జరుపుకున్నాయి. అయితే 1990 ప్రాంతంలో ప్రయివేటు వ్యక్తులు ఈ స్థలాన్ని కొనుగోలు చేసి దీన్ని కూల్చివేశారు, అయినా ఇప్పటికి ఎంతో మంది ఇక్కడకు ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని చూసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉంటారు. అలాగే ఇక్కడి గ్రంథాలయం ఎదురుగా సరస్వతి సమాజం ఉండేది. ఇందులోనే 1987 భారతీరాజా దర్శకత్వంలో చిరంజీవి, సుహాసిని నటించిన ఆరాధన చిత్రం షూటింగ్ జరిగింది. ఇందులో స్కూల్ దానికి టీచర్‌గా సుహాసిని...చిరంజీవి చదవు నేర్చుకోవడానికి వచ్చే సన్నివేశాలు చిత్రీకరించారు. అలాగే సుహాసిని బడికి రావద్దని చెప్పడంతో చిరంజీవి దీనికి ఎదురుగా ఉన్న దిమ్మపైన ఒంటికాలిపై నిలబడే సన్నివేశాలు, దీని దగ్గరలో అప్పటి లైట్‌హౌస్ కీపర్‌కు సంబంధించిన క్వార్టర్స్‌లో చిరంజీవి ఇల్లు అందులో ఆయనకు సంబంధించి కొన్ని సన్నివేశాల చిత్రీకరించారు. ఇంకా బీచ్ పరిసరాల్లో ఎక్కువభాగం చిత్రీకరణ జరుపుకుంది. అలాగే 1993లో ప్రస్తుత రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కే.రోజా భర్త సెల్వమణి రోజాతో చామంతి అనే ప్రేమ కథా చిత్రాన్ని తీయగా దానికి సంబంధించిన ముఖ్య సన్నివేశాలను బ్యాంక్ రోడ్డులోని ఓషన్‌వ్యూ బంగ్లా వద్ద చిత్రీకరించారు.

ఇప్పటికీ అలాగే ఉన్నాయి

పైన తెలిపిన చిత్రాలకు సంబంధించిన చిత్రీకరణ చేసిన ప్రదేశాల్లోని నిర్మాణాల్లో ఒక్క గాలిమేడ తప్పించి మిగిలినవి అలాగే ఉండడం విశేషం. ఇక్కడ బీచ్ దగ్గరలో గ్రంథాలయం పక్కన ఆరాధన సినిమా తీసిన స్కూల్, దిమ్మ, దగ్గరలో చిరంజీవి ఇల్లు చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఇక్కడకు వచ్చే సందర్శకులు వాటిని చూడవచ్చు. బ్యాంక్ రోడ్డులో చామంతి సినిమాకు సంబంధించిన ఓషన్‌వ్యూ బంగ్లా కూడా అలాగే ఉంది.